నిషేధం పాటిద్దాం.. ముప్పును తప్పిద్దాం

- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో అనర్థాలు
- విందులు, వినోదాల్లో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువులు వాడాలని పర్యావరణ నిపుణుల సూచన
- తాజాగా 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ఎస్‌యూపీలపై ప్రభుత్వం నిషేధం



కర్నూలు(సెంట్రల్): అరిటాకుల్లో అన్నం తిని ఎన్నాళ్లైంది. పాతికేళ్ల క్రితం వరకు పండగొచ్చినా, పబ్బమొచ్చినా అరిటాకుల్లో పసందైన భోజనం చేసే వారు. కానీ ఇప్పుడు ఏం జరుగుతోంది. ఏ పెళ్లికి వెళ్లినా ప్లాస్టిక్ ప్లేట్లలోనే భోజనాలు. ప్లాస్టిక్ గ్లాసుల్లోనే నీళ్లు తాగడాలు. సాయంత్రానికి ఫంక్షన్ హాలు నుంచి ట్రక్ నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు. అంతేనా.. మార్కెట్లో ఏమీ కొనాలన్నా..షాపింగ్‌కు వెళ్లినా, రెస్టారెంట్లు, దుకాణాలు... చివరకు ఆలయాల్లో కూడా ప్రసాదాలకు పాలిథిన్ క్యారీ బ్యాగులను ఉపయోగిస్తున్నాం. ఇలా ప్లాస్టిక్ విచ్చలవిడిగా వినియోగించడం వల్ల భవిష్యత్‌లో పెనుప్రమాదం తప్పదని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధించి..పర్యావరణానికి వాటిల్లే ముప్పును తప్పిద్దామని అంటున్నారు.

120 మైక్రాన్ల కంటే తక్కువ వాటిపై నిషేధం...

ప్లాస్టిక్‌పై పోరాటంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. 2023 జనవరి 1 నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం విధించింది. గతంలో 30 మైక్రాన్లలోపు, 50 మైక్రాన్లలోపు ఉన్న ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. అయితే జిల్లాలో పాస్టిక్ నిషేధం పాటించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. పాలు, పండ్లు, కిరాణా, ఆహార పొట్లాలు, విందులు, వినోదాల్లో వినియోగించి వాటర్ గ్లాసులు, ప్లేట్లు, ఇతర డిస్పోజల్ పదార్థాలు చాలా వరకు 20 నుంచి 30 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉంటున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. స్థానిక సంస్థలు కూడా పాస్లిక్ వినియోగంపై నిఘా వేయడంలో విఫలమయ్యాయి. ప్రజలు ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల బదులు జనపనార, కాటన్ సంచులు వాడాలని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ రోజు నుంచే సింగిల్ యూజర్ ప్లాస్టిక్‌కు బదులు ప్రత్యామ్నాయ వస్తువులు వాడడం మొదలు పెడితే మంచిది.

ఏడాదికి లక్ష టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు

ఓ చిన్న ప్లాస్టిక్ బాటిల్ జీవ శైథిల్యం చెందడానికి సగటున 450 ఏళ్లు పడుతుంది. కొన్ని బాటిళ్లు పూర్తిగా భూమిలో కలసిపోవడానికి 1000 ఏళ్లు కూడా పట్టవచ్చు. పోలి ఎథిలిన్‌తో తయారైన బాటిళ్లు ఎప్పటికీ భూమిలో శిథిలం కావు. ఇలా ప్లాస్టిక్ శిథిలం కావడానికి వందల ఏళ్లు పడుతున్న నేపథ్యంలో వానలు, గాలికి అవి వాగులు, వంకల నుంచి నదులు, నదుల నుంచి సముద్రాల్లోకి చేరడంతో అక్కడ లక్షల టన్నుల వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. అంతేగాక ప్లాస్టిక్ వినియోగం వల్ల మనుషులకు పలు వ్యాధులు రావడంతోపాటు అవి నేలలో, నీటిలో కలిసే సమయంలో విడుదల చేసే హానికరమైన రసాయనాల వల్ల భూమి, జలవనరులు కలుషితం అవుతాయి. ఈ నేపథ్యంలో ఉత్పత్తి అయినా ప్లాస్టిక్‌ను ఎక్కడిక్కడే రీసైక్లింగ్ యూనిట్ల ద్వారా పునరుత్పత్తి చేసుకోవాలి. కర్నూలు జిల్లాకు సంబంధించి ఏడాదికి లక్ష టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని రీసైక్లింగ్ చేసే యూనిట్లు ఒక్కటి కూడా లేదు. రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే చాలా మేలు జరుగుతుంది.

ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గించండి ఇలా..

- డంపింగ్ యార్డుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఎవరికి వారు నిత్య జీవితంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని దూరం పెట్టాలి.
- సరుకుల కోసం మార్కెట్ వెళ్లినప్పుడు కాటన్ సంచులను తీసుకెళ్లాలి.
- బిర్యానీ పార్సిల్ అడిగితే కనీసం ఐదు ప్లాస్టిక్ డబ్బాలను ఇస్తారు. వీటి బదులు ఇంటి నుంచే స్టీలు క్యారియర్స్ తీసుకెళ్లాలి.
- డిస్పోజబుల్ చాప్ స్టిక్స్, నైఫ్స్, స్పూన్లు, స్పోర్క్‌లు ఉపయోగించకుండా ఉంటే మంచిది.
- పిల్లలకు క్లాత్ డైపర్స్‌ను ఉపయోగించడం మేలు.
- విందులు, వినోదాల్లో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లకు బదులు స్టీలు కంచాలు, గ్లాసులు మేలు.

ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలి



ప్రస్తుతం ఆహార పొట్లాల నుంచి గుళ్లలో ప్రసాదాల వరకు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వినియోగిస్తున్నారు. దీంతో ప్రపంచానికి ప్లాస్టిక్ పెనుభూతంగా మారింది. ముఖ్యంగా ప్రజలు వినియోగించే సింగిల్ యూజర్ ప్లాస్టిక్‌తో అనర్థాలు వస్తున్నాయి. ఈ రోజు నుంచైనా సింగిల్ యూజర్ ప్లాస్టిక్‌ను ప్రజలు ఎవరికి వారు స్వస్తి పలకాలి.
– బీవై మునిప్రసాదు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి జోనల్ అధికారి

గఫూర్ పయనమెటు?

- పార్టీకి దూరమైనట్లు మీడియాలో ప్రచారం

కర్నూలు(సెంట్రల్): సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, రాష్ట్ర కమిటీ కార్యదర్శి వర్గసభ్యుడు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ ఆ పార్టీపై అలకబూనారు. పార్టీ పదవుల్లో తమ నేతకు అన్యాయం జరిగిందని ఆయన సన్నిహితులు చెబుతున్న సమయంలో పార్టీకి దూరంగా ఉంటున్నట్లు సోషల్ మీడియాలో న్యూస్ చక్కర్లు కొడుతుండడంతో గమనార్హం. అయితే ఈ విషయంపై ఆయనను వివరణ కోరేందుకు సాక్షి ప్రతియత్నంచగా అందుబాటులోకి రాలేదు. కుటుంబ సభ్యులు మాత్రం ఏదైనా ఉంటే చెబుతామని పేర్కొంటుండడంతో పలు అనుమానాలు రేకెత్తున్నాయి. ఇటీవల సీఐటీయూ నుంచి పూర్తిగా రిలీవ్ అయి విజయవాడ నుంచి వచ్చి కర్నూలులో ఉంటున్నారు. అయితే ఇక్కడ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. పార్టీ పరంగా ఏదైనా అడిగిన ఆరోగ్యం సహకరించడం లేదని చెబుతూ దాట వేస్తున్నారనే సమాధానం వస్తోంది.

19న రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 19న ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరంలో రాష్ట్ర స్థాయి రగ్బీ మినీ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన అనుబంధ రగ్బీ అసోసియేషన్ జట్లు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పాల్గొనే క్రీడాకారులు 2011, 2012, 2013 సంవత్సరాల్లో జన్మించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు.

క్లుప్తంగా

నేడు కెనరా బ్యాంకు రుణమేళా

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు కర్నూలు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 16న రీటైల్ రుణ మేళా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టనున్నట్లు రీజినల్ మేనేజర్ కే వీరేంద్రబాబు తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు రుణమేళా మొదలు అవుతుందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణమేళా ద్వారా గృహ, వాహన, విద్య రుణాలు, స్థిరాస్తి తనఖాలోన్‌ల మంజూరుపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన వారికి రుణాలు అక్కడికక్కడే మంజూరు చేస్తామన్నారు. కెనరా బ్యాంకు గృహ రుణాలను 8.85 శాతం వడ్డీ రేటుతో మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రుణమేళాలో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ఇంజినీరింగ్, మెడికల్, పారా మెడికల్, ఇతర వృత్తి విద్యా కోర్సులు చదివే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, బిల్డర్లు తదితరులందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సులువుగా ఆన్‌లైన్‌లో బిల్లుల చెల్లింపు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించడం ఎంతో సులువు అని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఏడీఈ వై.సుబ్బన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలవారీ విద్యుత్ బిల్లుల స్పాట్ బిల్లింగ్ ప్రక్రియ ద్వారా అందరికీ డిమాండ్ నోటీసులు జారీ చేశామని, బిల్లులు అందిన వినియోగదారులు నిర్ణీత గడువులోపు చెల్లించాలని సూచించారు. కౌంటర్ల వద్ద గంటల సేపు క్యూలో నిలిచి ఉండే బదులు ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్, యాప్‌లతో పాటు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా ఎక్కడ ఉన్నా చెల్లించడం సులభమని పేర్కొన్నారు.

పప్పుశనగ కొనుగోలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): పప్పుశనగను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం కోరారు. బుధవారం ఆయన సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ..మార్కెట్‌లో పప్పుశనగ ధర రూ.4500 పలుకుతోందన్నారు. అయితే రైతులకు అది గిట్టుబాటు కాదని, ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టి సాగు చేసిన నేపథ్యంలో వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. క్వింటం రూ.7 వేల ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో ఆస్పరి, దేవనకొండ, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద, ఆలూరు, కోసిగి, మంత్రాలయం, కోడుమూరు, కల్లూరు మండలాల రైతులు అధికంగా పప్పు శనగను సాగు చేసినట్లు చెప్పారు.

తనిష్క్ జ్యువెలరీ షోరూమ్ ప్రారంభం



తనిష్క్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న టైటాన్ రీజనల్ బిజినెస్ హెడ్ శరత్

కర్నూలు(టౌన్): టాటా గ్రూప్‌నకు చెందిన బంగారు ఆభరణాల తనిష్క్ షోరూమ్‌ను బుధవారం ప్రారంభించారు. స్థానిక మేడమ్ కాంపౌండ్ వద్ద మూడు అంతస్థులలో ఏర్పాటు చేసిన ఈ షోరూమ్‌ను టైటాన్ రీజనల్ బిజినెస్ హెడ్ శరత్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షోరూమ్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారుల కోసం తనిష్క్‌లో ప్రతి కొనుగోలుపై ఉచితంగా బంగారు నాణెం అందిస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులకు నాణ్యమైన ఆధునిక ఆభరణాలు అందించడమే తమ సంస్థ ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ మేనేజర్ శ్రీకృష్ణ, సస్య గ్రూప్‌కు చెందిన అధినేతలు శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, కృష్ణమోహన్, సస్యలు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

పాణ్యం: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న సంత్ సేవాలాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఇతర పూజా కార్యక్రమాలు చేపట్టారు. గిరిజనులు అధికం సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : పఠాన్, వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, మైఖేల్, వారసుడు, అమిగోస్, టైటానిక్, రైటర్ పద్మభూషణ్, నువ్వొస్తానంటే నేనొద్దంటానా
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్: వీర సింహారెడ్డి, వారసుడు, అమిగోస్, వసంత కోకిల, రైటర్ పద్మభూషణ్, నువ్వొస్తానంటే నేనొద్దంటానా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: వాల్తేరు వీరయ్య, అమిగోస్
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, పఠాన్, రైటర్ పద్మభూషణ్, టైటానిక్, నువ్వొస్తానంటే నేనొద్దంటానా
భరత్ కాంప్లెక్స్ : పఠాన్, వేదా, వారసుడు
రాజ్: పాప్ కార్న్
శ్రీరామ : ధమాకా
విజయ: వేదా

బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మిస్తేనే మేలు

- జెడ్పీ ఛైర్మన్‌ను కలిసిన రాయలసీమ జేఏసీ నేతలు



జెడ్పీ ఛైర్మన్ నుంచి మద్దతు లేఖను తీసుకుంటున్న రాయలసీమ జేఏసీ నేతలు

కర్నూలు(అర్బన్): కృష్ణా నదిపై సోమశిల నుంచి సిద్దేశ్వరం సంగమేశ్వరం వరకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న బ్రిడ్జి (తీగల వంతెన) వద్దని, బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మిస్తే రెండు రాష్ట్రాలకు మేలు జరుగుతుందని రాయలసీమ జేఏసీ నేతలు చెప్పారు. బుధవారం జేఏసీ కో ఆర్డినేటర్ వేణుగోపాల్‌రెడ్డి, సభ్యులు డా.పారా శ్రీధర్‌రెడ్డి, గడ్డం అమర్నాథ్‌రెడ్డి జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిని కలిసి బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణానికి మద్దతు లేఖను తీసుకున్నారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ బిడ్జి కం బ్యారేజీ నిర్మాణానికి రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని కేంద్ర మంత్రులు చెబుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లేందుకు వీలుగా రాయలసీమలోని ఎనిమిది మంది ఎంపీలు, 52 మంది ఎమ్మెల్యేల మద్దతు కోరుతున్నామన్నారు. అందులో భాగంగానే ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందించి వారి నుంచి అధికారిక లేఖలు తీసుకుంటున్నామన్నారు.

ఏపీఈడబ్ల్యూఐడీసీకి సహకారం అందించండి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ఏపీఈడబ్ల్యూఐడీసీ మనుగడకు ఆర్థిక సహకారం అందించాలని ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గోన నాగరాజు కోరారు. బుధవారం సాయంత్రం స్థానిక మౌర్యా ఇన్‌లోని సమావేశం హాలులో జరిగిన ప్రజా, దళిత సంఘాల నేతల సమావేశానికి హాజరైన రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ ప్లానింగ్ సెక్రటరీ విజయ్ కుమార్‌ను సంఘం నేతలు కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఎస్సీల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ మూడు సంవత్సరాల్లో కేటాయించిన రూ.49,710 కోట్ల ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులలో చట్ట ప్రకారం 40 శాతం నిధులు రూ.19,884 కోట్లను ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కేటాయించాలని కోరారు. ఆ నిధులతో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పన సాధ్యమవుతుందన్నారు. గతంలో సాంఘిక సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగాన్ని ప్రస్తుతం ఏపీఈడబ్ల్యూఐడీసీగా కొనసాగిస్తున్నారని చెప్పారు. ఈ సంస్థ ద్వారా చేపట్టిన మన బడి నాడు– నేడు పనుల వల్ల ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వానికి దేశ వ్యాప్తంగా మంచి పేరు వచ్చిందని తెలిపారు. అయితే ప్రభుత్వం ఈ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల జీతభత్యాలకు ఏడు శాతం పీఎస్ చార్జీలకు బదులు 1.50 శాతం కేటాయించడం వల్ల సంస్థ మనుగడ కష్టసాధ్యమైందన్నారు. ఈ నేపథ్యంలోనే సంస్థకు పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారు ఎస్.సి.హెచ్.బజారన్న, జిల్లా అధ్యక్షుడు వి.ఎం.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు సుంకన్న, ప్రధాన కార్యదర్శి ఎస్.సుంకన్న, కోశాధికారి సంజీవకుమార్ తదితరులు ఉన్నారు.



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎస్సీ సంక్షేమ సంఘం నేతలు

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయండి

కర్నూలు(సిటీ): ప్రభుత్వ జూనియర్, ఒకేషనల్ కాలేజీల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని ఏపీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్ కేబినెట్ ప్లానింగ్ కార్యదర్శి విజయ్‌కుమార్‌ను కోరారు. బుధవారం కర్నూలులో పర్యటించిన సందర్భంగా ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకుల సమస్యలపై ప్లానింగ్ కార్యదర్శికి లెక్చరర్స్ అసోసియేషన్ తరపున వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా చాలీచాలని వేతనాలతో జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్నామని, పక్క రాష్ట్రంలో తమతో పాటు ఎంపికైన కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేశారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏపీలో కూడా కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని విన్నవించారు.

మెడికల్ కాలేజీల్లో విద్యాబోధన మెరుగుపర్చండి

- డీఎంఈ వినోద్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల్లో విద్యాబోధన మరింత మెరుగుపర్చాలని వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన అమరావతి నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా బోధనాసుపత్రుల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల్లో ఇకపై ప్రతి వారం ఏదో ఒక విభాగం ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు, నిరంతర వైద్య విద్య కార్యక్రమాలు నిర్వహించి తద్వారా వైద్య విద్యార్థులకు మరింత నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. మెడికల్ కళాశాలల అభివృద్ధి నిధులను ఉపయోగించి ఆయా విభాగాల అభివృద్ధికి ఖర్చు చేయాలని చెప్పారు. ఈ మేరకు ఆయా విభాగాధిపతులు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. కొత్తగా ఏర్పడిన కళాశాలల్లో టీచింగ్ ఎయిడ్స్‌ను కొనుగోలు చేసేందుకు జాబితా రూపొందించి ఇండెంట్ ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి డైట్ కాంట్రాక్ట్ జైపాల్ రెడ్డికే

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు, డ్యూటీ వైద్యులకు ఆహారాన్ని అందించే డైట్ కాంట్రాక్ట్‌ను పూర్వ కాంట్రాక్టర్ జైపాల్‌రెడ్డికే దక్కింది. ఇటీవల డైట్ కాంట్రాక్ట్‌కు ఆసుపత్రి అధికారులు టెండర్ పిలువగా 8 మంది కాంట్రాక్టర్లు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు వారి దరఖాస్తులను జాయింట్ కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలోని సెలక్షన్ కమిటీ పరిశీలించింది. నోటిఫికేషన్‌లో ఇచ్చిన నిబంధనల మేరకు అధిక మార్కులు జైపాల్‌రెడ్డికి లభించడంతో ఆయనకే కాంట్రాక్టును అప్పగించారు. కాగా గతంతో పోలిస్తే డైట్ చార్జీలు ఈసారి రెట్టింపయ్యాయి. దీంతో కాంట్రాక్టును దక్కించుకునేందుకు దరఖాస్తుదారులు ఎవరి స్థాయిలో వారు పోటీ పడ్డారు. ఈ నేపథ్యంలో గత రెండు వారాలుగా ఈ టెండర్ విషయమై ఉత్కంఠ నెలకొంది.

మద్యం కేసులో మట్కా బీటర్లు అరెస్టు

కర్నూలు: కర్నూలు నగరం బుధవారపేట నుంచి ఉస్మానియా కాలేజీకి వెళ్లే దారిలోని హంద్రీ బ్రిడ్జి వద్ద అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో మూడవ పట్టణ పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. బుధవారపేటకు చెందిన ధరూర్ ప్రసాద్, ధరూర్ సందీప్‌కుమార్, మురళీకృష్ణ కొన్నేళ్లుగా మట్కా బీటర్లుగా పనిచేస్తూ పోలీసు రికార్డులకెక్కారు. బుధవారం మధ్యాహ్నం హంద్రీ బ్రిడ్జి వద్ద తెలంగాణ మద్యం విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పది తెలంగాణ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు మూడవ పట్టణ పోలీసులు తెలిపారు.

17 నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు

- రూపాల సంగమేశ్వరాలయంలో ఏర్పాట్లు పూర్తి



ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈవో, సమితి సభ్యులు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారులోని జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రూపాల సంగమేశ్వర స్వామి జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి అధ్యక్షులు ప్యాలకుర్తి నరసింహారెడ్డి, ఆలయ ఈవో వై.గురురెడ్డి పేర్కొన్నారు. బుధవారం శాలమ్మ సత్రంలోని ఆలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లా విడిపోయిన తరువాత జిల్లాలో ఉన్న ప్రముఖ శైవాలయం ఇదే అన్నారు. ఈ ఆలయంలో ఈ నెల 17 నుంచి శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తొలిరోజు ఉదయం 8 గంటలకు గణపతి పూజ, కలశ స్థాపన, రుద్రహోమం, ధ్వజారోహణ, 18వ తేదీ ఉదయం 5 నుంచి 9 గంటల వరకు అభిషేకం, 12 గంటల వరకు పాలాభిషేకం, రుద్రహోమం, మధ్యాహ్నం 1 గంటకు స్వామివారికి అలంకరణ, సాయంత్రం 6 గంటలకు దిన్నెదేవరపాడు గ్రామస్తులచే ప్రభోత్సవం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం, భక్తులు జాగరణ చేసేందుకు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథ, భజన కార్యక్రమాలు, 19వ తేదీ తెల్లవారు జామున శివపార్వతుల కల్యాణం, స్వామివారికి ప్రాకార పల్లకీ సేవ, సాయంత్రం 5 గంటలకు శివపార్వతుల రథోత్సవం జరుగుతుందన్నారు. సమితి జాయింట్ సెక్రటరీలు కె.క్రిష్టన్న, మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఆలయం చేరుకోడానికి ఏపీఎస్ ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారన్నారు. గడియారం ఆస్పత్రి, కొత్త బస్టాండ్, రాజ్‌విహార్, సీక్యాంప్, వెంకటరమణ కాలనీ, బళ్లారి చౌరస్తా, కల్లూరు, క్రిష్ణానగర్, దిన్నెదేవరపాడు మీదుగా జగన్నాథ గట్టుపైకి బస్సుల సౌకర్యం ఉంటుందన్నారు. సమావేశంలో సమితి సభ్యులు వాసుదేవయ్య, మహాబలేష్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

వేసవి డిమాండ్‌కు అనుగుణంగా పాలు, మజ్జిగ

- విజయ డెయిరీ ఛైర్మన్ ఎస్‌వీ జగన్‌మోహన్‌రెడ్డి



కర్నూలు డెయిరీలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న చైర్మన్ ఎస్‌వీ జగన్‌మోహన్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): వేసవిలో డిమాండ్‌కు అనుగుణంగా పాలు, మజ్జిగ సరఫరా చేయడానికి తగిన చర్యలు తీసుకున్నట్లు విజయ డెయిరీ చైర్మన్ ఎస్‌వీ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్ ప్రక్కన ఉన్న కర్నూలు డెయిరీలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలు, యూనిట్లను పరిశీలించారు. రానున్న వేసవిలో వినియోగదారులకు మరింత నాణ్యత కలిగిన పాలు, మజ్జిగ సరఫరా చేయడంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత వేసవిలో కర్నూలు డెయిరీ ద్వారా అత్యధికంగా రోజుకు లక్ష ప్యాకెట్లు అమ్మడం జరిగిందని, ఈ సారి 1.50 లక్షల ప్యాకెట్లు అమ్మే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. కిరాణం షాపులు, పాల విక్రయ కేంద్రాలు, కూరగాయల మార్కెట్‌లు, వ్యవసాయ మార్కెట్ యార్డులు, కలెక్టరేట్ ప్రాంగణం, ఆర్‌టీసీ బస్టాండులు, రైల్వే స్టేషన్‌లు తదితర అన్ని ప్రదేశాల్లో విజయ మజ్జిగను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. మజ్జిగలో మరింత నాణ్యత కోసం కూలింగ్ పెంచడం, ప్రాసెసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు స్పష్టం చేశారు. అనంతపురం జిల్లాలో అదనంగా 20 వేల లీటర్ల పాలను సేకరించడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వేసవి డిమాండ్‌కు అనుగుణంగా వినియోగదారులకు పాలు, మజ్జిగ సరఫరా చేస్తామని వివరించారు. కార్యక్రమంలో కర్నూలు డెయిరీ మేనేజర్ ఎస్.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గ్రంథాలయాలు




జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డైరెక్టర్ ప్రసన్నకుమార్

కర్నూలు కల్చరల్: గ్రంథాలయాలు అభివృద్ధి పథంలో ఉన్నాయని, పాఠకులకు అవసరమైన అన్ని వసతులు, మెటీరియల్ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయని ఏపీ పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు డాక్టర్ ఎమ్ఆర్. ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. కర్నూలు పర్యటనకు వచ్చిన ఆయన బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు పలు గ్రంథాలయ శాఖలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల నూతన భవనాల నిర్మాణాలు, మరమ్మతులకు అనుమతులు ఇస్తున్నామన్నారు. ఉద్యోగార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ తెప్పిస్తున్నామన్నారు. కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయం రాష్ట్రంలో ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తు గ్రంథాలయాలను ప్రజల చెంతకు చేర్చడం అభినందనీయమన్నారు. దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం, సదస్సులు, సెమినార్లు, రౌండ్ టేబుల్ సమావేశాలతో గ్రంథాలయాలపై అవగాహన కల్పించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, కార్యదర్శి ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్కలు ప్రసన్నకుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గోవిందరెడ్డి, లైబ్రేరియన్లు బాషా, మక్బుల్ బాషా, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

'వీరశైవ లింగాయత్' అన్నదానం అభినందనీయం

- మేయర్ బీవై రామయ్య



వీరశైవ లింగాయత్ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బీవై రామయ్య

కర్నూలు(అగ్రికల్చర్): శ్రీశైలం వెళ్లే శివస్వాములు, భక్తులకు వారం రోజుల పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టిన వీరశైవ లింగాయత్ ప్రతినిధులను కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ బీవై రామయ్య అభినందించారు. ప్రతి ఏటా వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో శ్రీశైలం వెళ్లే యాత్రికులకు కర్నూలు శివారులోని పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ దగ్గర అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా నాలుగు రోజుల క్రితమే అన్నదాన కార్యక్రమం చేపట్టారు. బుధవారం అన్నదానం కార్యక్రమానికి మేయర్ హాజరై స్వయంగా స్వాములకు అన్నప్రసాదాలు వడ్డించారు. వీరశైవ లింగాయత్ చేస్తున్న అన్నదాన కార్యక్రమం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్‌లు వీరచంద్రారెడ్డి, విశ్వనాథరెడ్డి, రుక్మాంగదరెడ్డి, గోపాల్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ చైర్మన్ రుద్రగౌడ్, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బెల్లం మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజావిష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సామాజిక తనిఖీతోనే పనుల్లో నాణ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్ఎస్ఏటీ-ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ ఎం.జగదీశ్ కుమార్

కర్నూలు(అర్బన్): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో సామాజిక తనిఖీలతోనే పారదర్శకత, నాణ్యత ఉంటుందని ఏపీఎస్ఎస్ఏటీ-ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ ఎం.జగదీశ్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లాపరిషత్ సమావేశ భవనంలో సామాజిక తనిఖీ ప్రాంతీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నెల్లూరు, రాయలసీమ ప్రాంతానికి చెందిన ఎస్‌టీఎం, ఏపీసీ, ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన వైఎస్సార్ పెన్షన్ కానుక ఆడిట్‌లు మార్చి 31లోగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం వేతనదారులను భౌతికంగా కలసి వాళ్లకు సకాలంలో వేతనాలు అందాయా లేదా అనే అంశాన్ని పరిశీలించాలన్నారు. అలాగే ఈ పథకం ద్వారా చేపట్టిన పనులను పరిశీలించి నివేదికలను తయారు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రోగ్రామ్ మేనేజర్ ఎం.ఎస్.సునిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు



శ్రీశైలం భక్తులకు మందులు అందజేస్తున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి తదితరులు

కర్నూలు(హాస్పిటల్): శ్రీశైలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ జిల్లా చైర్మన్ డాక్టర్ కె.జి.గోవిందరెడ్డి చెప్పారు. శ్రీశైలం వెళ్లే భక్తులకు, శివస్వాములకు దట్టమైన అడవిలోని పెచ్చెరువు, భీమునికొలను, కైలాసద్వారం, శ్రీశైలంలోని నందిమండపంలలో ఈ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు ప్రథమ చికిత్సతో పాటు మందులు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం 50 మందితో కూడిన వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ నెల 19వ తేదీ వరకు ఈ శిబిరాలు అయా చోట్ల కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ శిబిరాలను మాజీ చైర్మన్ జి.శ్రీనివాసులు, ఎంసీ మెంబర్ అరుణ, మధుసూదన్, ఏవో సుబ్బారెడ్డి, డాక్టర్ బ్రహ్మారెడ్డి, సేవకులు వెంకటరెడ్డి, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ రమేష్‌బాబు తదితరులు పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

21న బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో ఈ నెల 21న అంతర్ రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగు పోటీలు నిర్వహిస్తున్నట్లు దేస్థాన ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 79810 16808, 9640 643253 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.